క్లుప్తంగా

దూరవిద్యలో ప్రవేశాలకు ఆహ్వానం

రణస్థలం: ఇంటర్మీడియెట్ దూరవిద్య కోర్సు లో చేరేందుకు డ్రాపౌట్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రణస్థలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ సూర్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి వివిధ కారణాలతో ఇంటర్మీడియెట్ మొదటి, రెండో సంవత్సరాల చదువును మధ్యలో మానేసిన వారు అర్హులని పేర్కొన్నారు. పదో తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈ నెల 26లోగా కళాశాలలో సంప్రదించాలని కోరారు.

గార: కళింగపట్నం కోకా వారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ దూరవిద్య లో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ ఆనంద్‌కుమార్ రాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం రాగోలు జెమ్స్ వైద్య కళాశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ అశ్వనీకుమార్, డాక్టర్ వసుంధరారావు ఆధ్వర్యంలో వైద్య బృందం 520 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌సీవీ రమణమూర్తినాయుడు ప్రారంభించారు. జాతీయ సేవాపథకం విద్యార్థులు సహకరించారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని పెంట ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం మజ్జి మదన్‌మోహన్ ఆధ్వర్యంలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా వసతి సౌకర్యాలు, విద్యా బోధన అందుతున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొర్లె శేఖర్, కోనా నారాయణప్పుడు, గిడిజాల చంద్రరావు, కేశవరావు, మక్క శ్రీరాములు, ధర్మారావు, బొల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన అవసరం

ఎచ్చెర్ల: వెలుగు ద్వారా అమలవుతున్న అన్ని పథకాలపై సీఎఫ్‌లు అవగాహన కలిగి ఉండాలని వెలుగు ఏపీఎం ఆర్.రామ్మూర్తి తెలిపారు. ఎచ్చెర్ల మండల వెలుగు కార్యాలయంలో సీఎఫ్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ ద్వారా జెండర్, ఆరోగ్యం, పోషణ వంటి కార్యక్రమాలపై సంఘాలకు అవగాహన కల్పించాలన్నారు. బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి ద్వారా సంఘాలకు అందిస్తున్న రుణాలను సకాలంలో రికవరీ చేయాలని సూచించారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ యశ్వంత్

జి.సిగడాం: వేసవిలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ యశ్వంత్ కోరారు. శుక్రవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివప్రసాదరావు, రమాదేవి, ఉమా, ఆరోగ్య కార్యకర్తలు పేడాడ సత్తెరాజు, పాగిరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కామాక్షి పంచలోహ విగ్రహ ప్రతిష్ట



కామాక్షి అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాండ్రంగి వీధిలో కామాక్షి పీఠంలో కామాక్షి పంచలోహ విగ్రహ ప్రతిష్ట శుక్రవారం వైభవంగా జరిగింది. వేదుల వెంకటరమణశర్మ, వేదుల వెంకట సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పీఠార్చన, విశేష హవనం, కళావాహన, ప్రధానార్చన, మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ఏకాంబరేశ్వర సహిత కామాక్షి అమ్మవారికి శాంతి కల్యాణం జరిగింది. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గుడివాడ లతీష్, లంక లోకత్రినాథ ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పంట రక్షణకు మల్చింగ్

- టమాటా సాగులో కొత్త విధానం
- వాతావరణ సమస్యలు అధిగమించవచ్చంటున్న రైతులు



ఎస్‌ఎంపురంపేటలో మల్చింగ్ విధానంలో భాగంగా టమాటా పంటపై వరిగడ్డి వేసిన దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: వ్యవసాయంతో రైతులు వినూత్న పద్ధతులు అవలంబిస్తున్నారు. అధిక దిగుబడులతో పాటు పంటకు రక్షణ కల్పించేందుకు విధానాలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఇటీవల కాలంలో మల్చింగ్ విధానంలో సాగు చేయడంపై ఆసక్తి చూపుతున్నారు. వ్యర్థాలతో పంటను కప్పి రక్షణ కవచంగా ఏర్పాటు చేయడాన్ని మల్చింగ్ విధానంగా పిలుస్తున్నారు. ప్రధానంగా టమాటా, దోస, ఖర్బూజా వంటి పంటలకు మల్చింగ్ రక్షణగా నిలుస్తోంది.

దిగుబడులు భళా..

ఎచ్చెర్ల మండలంలో ఎచ్చెర్ల, ఎస్‌ఎంపురంపేట, కేశవరావుపేట, ఎస్‌ఎంపురం, చిలకపాలెం, ఇబ్రహింబాద్ వంటి గ్రామాల్లో 100 ఎకరాల్లో టమాటా సాగు చేస్తున్నారు. కిలో రూ.16 నుంచి రూ.20 మధ్య పలుకుతుండటంతో అధిక శాతం మంది రైతులు టమాటా సాగుపై దృష్టి పెట్టారు. దిగుబడులు సైతం ఆశాజనకంగా ఉన్నా వాతావరణం కలవరపాటుకు గురిచేసేది. ముఖ్యంగా మంచు బాగా కురవడం, ఎండల తీవ్రత పెరగటంతో పంటకు



మల్చింగ్ వల్ల పంట నాణ్యత

మల్చింగ్ చేయని పంటపై తెల్ల మచ్చలు

నష్టం కలిగేది. టమాటా కాయదశలో కుల్లటం, రాలటం, నాణ్యత దెబ్బతినటం వంటివి చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఉద్యాన వన శాస్త్రవేత్తలు మల్చింగ్ విధానం అవలంబించాలని రైతులకు సూచిస్తున్నారు.

ప్రయోజనాలు ఎన్నో..

- మల్చింగ్ అంటే పంటను వ్యర్థాలతో కప్పటం. ప్రధానంగా వరి గడ్డితో పంటను కప్పాల్సి ఉంటుంది. వరికి ప్రత్యామ్నాయంగా ఆకులు, ఇతర వ్యర్థాలు, గ్రీన్ హౌస్ నెట్స్ వంటివి సైతం వినియోగించవచ్చు.
- మల్చింగ్ వల్ల సూర్య కిరణాలు, మంచు నుంచి పంటకు రక్షణ లభిస్తుంది.
- భూమిలో తేమశాతం ఉంటుంది. ఫలితంగా నీరు ఎక్కువగా అవసరం ఉండదు. నీటి వినియోగానికి ఉపయోగించే డీజిల్ ఖర్చు తగ్గుతుంది. మోటార్లకు ఉపయోగించే విద్యుత్ ఆదా చేయవచ్చు.
- భూమి సారవంతంగా మారుతుంది.

మల్చింగ్‌తో మేలు..



నేలపై పండే టమాటా, దోస వంటి పండ్ల రకాల మల్చింగ్ విధానం మేలు చేకూర్చుతుంది. వరిగడ్డితో పంటను కప్పడం వల్ల ఎండ నుంచి పంటకు రక్షణ కలగడంతో పాటు నాణ్యమైన పంట దిగుబడి వస్తుంది. భూమిలో తేమ నిల్వ వల్ల నీటి వినియోగం తగ్గుతుంది.

– మెట్ట ధనుంజయ్, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు రిసోర్సు పర్సన్

ఎంసీఎంసీ పరిశీలన



ఎంసీఎంసీని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు శ్యామలరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి, స్థానిక సంస్థల శాసన మండలి సభ్యుల ఎన్నికల సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ)ని ఎన్నికల పరిశీలకుడు జె.శ్యామలరావు శుక్రవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో కలిసి సందర్శించారు. ఎన్నికల సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని, మీడియాకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని నోడల్ అధికారి, డీపీఆర్‌ఓ కె.బి.ఎం.సింగ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జి జేసీ బి.నవ్య, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌కు మద్దతుగా నిలవండి



కుశాలపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు పట్టభద్ర ఓటర్లు మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కోరారు. ఎచ్చెర్ల మండలం కుశాలపురం, కేశవరావుపేట, ఎస్‌ఎంపురం గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటర్లకు కరపత్రాలు అందజేసి మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, ఎచ్చెర్ల జెడ్పీటీసీ బల్లాడ హేమమాలినీరెడ్డి, నాయకులు, ప్రజా ప్రతినిధులు జరుగుళ్ల శంకరావు, సనపల నారాయణరావు, బల్లాడ జనార్దనరెడ్డి, బోర సాయిరాంరెడ్డి, పైడి భాస్కరరావు, అల్లు కన్నబాబు, పంచాది నరసింహమూర్తి, దుంప చిన్నారెడ్డి, బోర గోవిందరెడ్డి, సీరపు శ్రీరామ్మూర్తి, కొత్తకోట సూర్యారావు, గురుగుబెల్లి లక్ష్మున్నాయుడు, వెంకన్నగారి శ్రీను, పైడి చందు, పైడి ప్రసాద్, దుంప ఈశ్వరరావు, గుండ రవి తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ ప్రగతికి కృషి చేయాలి



శ్యామలరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లా కలెక్టర్ కార్యాలయానికి శుక్రవారం వచ్చిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావును శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. వర్సిటీ చేపడుతున్న అభివృద్ధి పనులే, విద్యా ప్రగతికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. వర్సిటీ ప్రగతికి కృషి చేయాలని వీసీకి సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎచ్చెర్ల క్యాంపస్: కొయ్యాం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా కొయ్యాం, కుప్పిలి, బడివానిపేట, అజ్జరాం పంచాయతీల పరిధిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రక్షణ రంగంలో అవకాశాలు అపారం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వెంకటరమణ

ఎచ్చెర్ల క్యాంపస్: యువతకు రక్షణ రంగంలో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఇండియన్ ఆర్మీ కాలింగ్ సెంటర్ ఇన్‌చార్జి బి.వెంకటరమణ అన్నారు. కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు రక్షణ రంగంలో ఉద్యోగాల నియామక ప్రక్రియపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆర్మీ, నేవీ, వైమానిక దళాల్లో పోస్టుల భర్తీ, ఉద్యోగాల ర్యాంకులు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.కృష్ణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలపై దృష్టి పెట్టాలి

గార: పదో తరగతి పరీక్షలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సమగ్ర శిక్ష సీఎంఓ హరికృష్ణ సూచించారు. శుక్రవారం అంపోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా జగనన్న కిట్లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూపై ఆరా తీశారు. పదో తరగతి సిలబస్‌తో పాటు డాట్ పరీక్షలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దయానంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపి కేంద్రంలో కొత్త పరికరం



నూతన పరికరంతో చికిత్స చేస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మగటపల్లి కల్యాణ్ నేత్ర కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపి కేంద్రానికి శుక్రవారం కొత్తగా ఇంటర్ ఫెరిటెంటియన్ థెరపి యూనిట్‌ను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ మెడిసన్ బ్యాంకులో ఉచిత వైద్య సేవలను అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఫిజియోథెరపిస్టు కోరాడ లక్ష్మణరావు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన ఐఎఫ్‌టీయూ ద్వారా ఒకేసారి కాళ్లకు, చేతులకు ట్రీట్‌మెంట్ ఇవ్వవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు సోమసుందరరావు, రెడ్‌క్రాస్ సభ్యులు పి.చైతన్యకుమార్, చిన్మయరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉగ్రనరసింహస్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

లావేరు: మండలంలోని బుడుమూరులో ఉగ్రనరసింహస్వామి ఆలయ పునఃప్రతిష్ఠాపనోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అఫీషియల్ రిసీవర్‌ను కలిసిన న్యాయవాదులు



శ్రీరాంసీతారాంను సత్కరిస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కోర్టు అఫీషియల్ రిసీవర్‌గా నియమితులైన శ్రీరాం సీతారాంను శుక్రవారం బీసీ న్యాయవాదులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం దుశ్శాలువతో సత్కరించారు. న్యాయవాదిగా, అఫీషియల్ రిసీవర్‌గా మంచి సేవలు అదించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, కూన అన్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు గేదెల వాసుదేవరావు, బార్ అధ్యక్షులు బెజ్జిపురం ఫల్గుణరావు, మాజీ అఫీషియల్ రిసీవర్ గరిమెళ్ల విశాలాక్షి, న్యాయవాది గొర్లె రామారావు పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళా పోలీసు అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఆశాలత



ఆశాలత

రణస్థలం: రాష్ట్ర గ్రామ, వార్డు సెక్రటేరియట్ మహిళా పోలీస్ అసోసియేషన్‌కు అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రణస్థలం మండలం తెప్పలవలస గ్రామ సచివాలయ మహిళా పోలీస్ సీహెచ్.ఆశాలత ఎంపికయ్యారు. ఈ నెల 20న గుంటూరులో జరిగిన కమిటీ సమావేశంలో ఈమెను ఎన్నుకున్నారు.

విస్తృతంగా ఎన్నికల ప్రచారం

ఎచ్చెర్ల క్యాంపస్: బీజేపీ మద్దతుతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న మాధవ్ శుక్రవారం ఎచ్చెర్ల మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, శ్రీ శివానీ గ్రూప్ ఆఫ్ కళాశాలల్లో పట్టభద్రులైన ఓటర్లను కలిసి తనకే మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.ఈశ్వరరావు, పైడి వేణుగోపాలం, సంపతరావు నాగేశ్వరరావు, తమ్మినేని గోవిందరావు పాల్గొన్నారు.

● ఆటపాటలతో అదరగొట్టారు



జెమ్స్ విద్యార్థులు ఆటపాటలతో అదరగొట్టారు. రాగోలు జెమ్స్ వైద్య కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో సంప్రదాయ నృత్యాలు, వెస్ట్రన్ డ్యాన్సు, ర్యాంప్‌వాక్, ఫ్యాషన్ షోలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జెమ్స్ సీఈఓ బొల్లినేని ఆద్విక్, సీఏఓ ఎస్.రామ్మోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీలలిత, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మరాజు, మెడికల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్, గూడేన సోమేశ్వరరావు, బాలచంద్రనాయుడు, హవీలా, ప్రదీప్ పాల్గొన్నారు.

– శ్రీకాకుళం రూరల్

సంతోషిమాతకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న సంతోషిమాత

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషి మాత అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో పూజలు చేసి, ఉద్యాపనులు, మహానివేదన, మహాహారతి నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: మండలంలోని కుంచాలకుర్మయ్యపేట దేవీ ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి క్షీరాభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మహామేరువు వద్ద దీపాలు వెలిగించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అజ్ఞానం వీడాలి



ఆలయ సందర్శనం చేస్తున్న స్వామీజీ

శ్రీకాకుళం కల్చరల్: ప్రతిఒక్కరూ తమలోని అజ్ఞానాంధకారాలను తొలగించుకునేందుకు ప్రయత్నించాలని కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ మహాస్వామి అన్నారు. బలగలోని బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తులసి మొక్కను పూజించాలని, రావి చెట్టు, వేపచెట్టును ఆరాధించాలని అన్నారు. అందరిలోనూ మాతృభక్తి, పితృభక్తి, గురుభక్తి ఉండాలన్నారు. కాగా, మూడో రోజు కూడా శతచండీ హోమాలు కొనసాగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శిష్టకరణాల సంక్షేమమే లక్ష్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శిష్టకరణాలను ఓబీసీలో చేర్చి వారి సంక్షేమానికి కృషి చేయడమే లక్ష్యమని వైఎస్సార్ సీపీ నాయకుడు బెలగాం జయప్రకాష్‌నారాయణ అన్నారు. ఏప్రిల్‌లో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నాయకత్వం వహించేందుకు జయప్రకాష్‌నారాయణను ఎంపిక చేసిన నేపథ్యంలో నగరంలోని ఓ హోటల్‌లో సత్కార సభ ఏర్పాటు చేశారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు, సదాశివుని కృష్ణలు జయప్రకాష్‌నారాయణను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, రఘు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆశయ సాధనే లక్ష్యం

జి.సిగడాం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యమని ఎంఎల్‌హెచ్‌పి సుభాషిణి అన్నారు. శుక్రవారం సంతవురిటి, ఆనందపురం, వాండ్రంగి, టిడివలస, మెట్టవలస, సీతంపేట, నిద్దాం గ్రామాల్లో రోగుల ఇంటివద్దకే వెళ్లి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు శిరీష, దివ్యరాజేశ్వరి, రాణి, సంతోషి, రమాదేవి, సంధ్యారాని, చంద్రకళ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘాల నాయకులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎన్జీవో కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల సలహాదారు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ (రి.నెం:138/2020) నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు, జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, జిల్లా కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు, నగర అధ్యక్షుడు బొత్స శ్రీనివాసరావు, గ్రామ వార్డు సచివాలయం ఫెడరేషన్ రాష్ట్ర సెక్రటరీ (స్పోర్ట్స్) నారాయణరావు, జిల్లా అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జిల్లా సెక్రటరీ సాయి దీక్షిత్, వర్కింగ్ ప్రెసిడెంట్ తిలక్, ఉపాధ్యక్షుడు విజయ్, కోశాధికారి ఢిల్లేశ్వరరావు, లక్ష్మణరావు, కొత్తూరు తాలూకా ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు అల్లు తిరుపతిరావు, టౌన్ నాయకులు కిరణ్‌కుమార్, జీవన్‌కుమార్, మహిళ విభాగ నాయకులు చైతన్యకుమారి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

లావేరు: అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని తాళ్లవలస సచివాలయం మహిళా సంరక్షణ అధికారి ఎస్.కామేశ్వరి అన్నారు. రావివలస అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

లావేరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు సూచించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చెత్తాచెదారాలు ఎక్కడ పడితే వేయరాదని సూచించారు.

● ఆకట్టుకున్న కోలాటం



బలగలోని బాలత్రిపుర కాలభైరవ దేవాలయంలో ఆధ్వర్యంలో జరుగుతున్న శతచండీ హోమాల సందర్భంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. విశ్వహిందూ పరిషత్ దుర్గావాహిని కార్యకర్తలు వారణాసి సంతోషి బృందం ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరిగింది.

– శ్రీకాకుళం కల్చరల్